క్లుప్తంగా

నేడు నల్లమారమ్మ జాతర

మాకవరపాలెం : మండలంలోని జి.కోడూరులో రెండేళ్లకోసారి నిర్వహించే నల్లమారమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం భారీ ఎత్తున జాతర జరిపేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే గ్రామంలో ఆకట్టుకునేలా విద్యుద్దీపాలంకరణ చేశారు. జాతర రోజు రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లకు అడ్మిషన్లు

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో 14, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ 13, ఎంకామ్‌లో 34 సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. డిగ్రీ చదివిన విద్యార్థులు పీజీ సెట్ పరీక్ష రాయకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 29 తేదీ ఆఖరు తేదీగా పేర్కొన్నారు.

కేసుల పురోగతిపై డీఎస్పీ ఆరా


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ మోహన్

నర్సీపట్నం : నర్సీపట్నం రూరల్ పోలీసు స్టేషన్‌ను బుధవారం డీఎస్పీ మోహన్ తనిఖీ చేసి, కేసుల పురోగతిపై ఆరా తీశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్ఐ రాజారావును అడిగి తెలుసుకున్నారు. క్రైమ్ రేటు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ సూచించారు.

ఘనంగా కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి కల్యాణం


కల్యాణ ఉత్సవ విగ్రహాలతో భక్తులు

బుచ్చెయ్యపేట : బంగారుమెట్ట గ్రామంలో కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఏకాదశి రోజున ఆలయంలో స్వామి వారి కల్యాణ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం రాత్రి అర్చకుల సమక్షంలో వేదమంత్రాలతో భక్తుల సమక్షంలో వేడుకగా స్వామివారి కల్యాణం జరిపించారు. కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి కల్యాణ ఉత్సవ విగ్రహాలతో భక్తులు ఊరేగారు. ఎల్‌బీ పురం, బంగారుమెట్ట, లోపూడి, వడ్డాది తదితర గ్రామాల భక్తులు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.

సభ్య రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

కె.కోటపాడు : కె.కోటపాడు పీఏసీఎస్‌ల పరిధిలో గల సభ్య రైతులంతా ఈకేవైసీ కార్యక్రమాన్ని చేయించుకోవాలని సంఘ మైగ్రేషన్ అధికారి రాజశేఖర్ అన్నారు. కె.కోటపాడు పీఏసీఎస్‌ను బుధవారం ఆయన పరిశీలించి సొసైటీలో జరుగుతున్న కంప్యూటరీకరణ పనులను పరిశీలించారు. సొసైటీ పరిధిలో గల సభ్య రైతులు తప్పనిసరిగా ఆధార్, రేషన్, పాన్, నామినీ ఆధార్ కార్డు, సభ్యత్వ పత్రం, ఫోన్ నంబర్‌ను ఇచ్చి ఈకేవైసీని చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేయించుకోని రైతులకు సభ్యత్వం రద్దు కానున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఆర్.చిన ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి


మోడల్ స్కూల్లో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో హేమసుందర్

చీడికాడ : పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీడీవో హేమసుందర్ అన్నారు. బుధవారం మండలంలోని మంచాల మోడల్ స్కూల్, కోనాం బాలికల గురుకుల పాఠశాలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయన మంచాల కేంద్రాన్ని పరిశీలించారు. తమ ఆధార్‌లో తప్పులను సవరించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ఉన్నారు.

చెట్ల నీడన భయం.. భయం


గిరిజన ఆశ్రమ పాఠశాలలో భారీ వృక్షాలు


రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధాన ద్వారం గేటు

- పాఠశాల ప్రాంగణంలో కాలం చెల్లిన భారీ వృక్షాలు
- తుపానులు, గాలులకు విరిగిపడుతున్న కొమ్మలు
- ఆటలకు దూరమైన విద్యార్థులు
- గిరిజన ఆశ్రమ విద్యార్థుల ఇక్కట్లు

నాతవరం : గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు భయం గుప్పిట్లో విద్యబోధన నడుస్తుంది. మండలంలో సరుగుడు పంచాయతీ శివారు రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారుగా 142 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల ప్రాంగణంలో కాలం చెల్లిన భారీ వృక్షాలు ఉండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కాలం వెళ్ల దీస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఎత్తయిన భారీ వృక్షాలు కారణంగా ఈదురు గాలలు వీచినప్పుడు శబ్దం రావడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని బయటకు రావడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం అంటున్నారు. భారీ వృక్షాల్లో కొన్ని కాలం చెల్లి ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా దర్శనమిస్తున్నాయి. పాఠశాల భవనాలు మధ్యలో భారీ వృక్షాల కారణంగా విద్యార్థులను ఆటలు ఆడుకునేందుకు సైతం ఉపాధ్యాయులు బయటకు పంపించడం లేదు. ఇటీవల సంభవించిన తుపాను సమయంలో గాలలుకు చెట్ల కొమ్మలు విరిగిపడడంతో తృటిలో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు బహిరంగంగా అంటున్నారు. ఆ సంఘటన జరిగిన దగ్గర్నుంచి వర్షం పడినా ఏమాత్రం గాలులు వీచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం భవనాల్లోంచి బయట చెట్ల కిందకు రావడానికి హడలెత్తిపోతున్నారు.

ప్రహరీ నిర్మించారు...గేటు మరిచారు...

గిరిజన ఆశ్రమ పాఠశాల చుట్టూ లక్షలాది రూపాయలతో ప్రహరీగోడ నిర్మించారు. పాఠశాలకు ప్రధాన గేటు ఏర్పాటు చేయడం మరిచారు. పాఠశాల ఉపాధ్యాయులు తాత్కాలికంగా కర్రలతో గేటు ఏర్పాటు చేసుకున్నారు. ప్రహరీగోడ ఉన్న గేటు లేకపోవడంతో రాత్రి సమయంలో అల్లరి మూకలు పాఠశాల ప్రాంగణంలోకి వచ్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేటు ఏర్పాటు చేయకపోవడం వలన ప్రహరీ గోడ ఉన్నా ఎలాంటి ఉపయోగం ఉండడం లేదు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం : టీడబ్ల్యూ డీడీ నాగశిరీష

ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు నాగ శిరీష వద్ద 'సాక్షి' ప్రస్తావించగా రామన్నపాలెం ఆశ్రమ పాఠశాలలో భారీ వృక్షాలు గేటు సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే చెట్లు తొలగించేందుకు కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే గేటు విషయం వెంటనే సంబంధిత కాంట్రాక్టరు, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి గేటు ఏర్పాటు చేస్తానన్నారు.

'ఐఆర్డీఏ నూతన విధానాలతో ఎల్ఐసీ నిర్వీర్యం'


మాట్లాడుతున్న ఏవోఐ రాష్ట్ర ఈసీ సభ్యుడు రమణ

దేవరాపల్లి: బీమా రంగంలో ఐఆర్డీఏ అక్టోబర్ 30న తీసుకువచ్చిన నూతన విధానాలు ఎల్ఐసీ మనుగడుకు ఆటంకంగా మారాయని ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఏవోఐ) రాష్ట్ర ఈసీ సభ్యుడు కె.వి. రమణ అన్నారు. ఈ మేరకు దేవరాపల్లిలో యూనియన్ నాయకులతో కలిసి బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆర్థిక రంగంలో అగ్ర స్థానంలో ప్రభుత్వ రంగ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియాను నిర్వీర్యం చేసే విధంగా ఐఆర్డీఏ, కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా మేలుకోకుంటే బీఎస్ఎన్ఎల్, స్టీల్‌ప్లాంట్ పరిస్థితి ఎల్ఐసీకి ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. దేశంలో ప్రజలకు కనీస జీవితకాలం పెరుగుతున్నందున పాలసీ తీసుకునే వయసును పెంచాల్సి ఉండగా 55 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు కుదించడం దారుణమన్నారు. పాలసీదారుల చెల్లించే ప్రీమియంపై జీఎస్టీని విధించడం దుర్మార్గమని, ఈ నిర్ణయాలతో ఎల్ఐసీ నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా యూనియన్ ఆధ్వర్యంలో డివిజన్ ఆఫీస్‌ల ఎదుట నిరసనలు, వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న ఛలో పార్లమెంట్ ధర్నాను చేపడుతున్నామని కె.వి.రమణ స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా ఎల్ఐసీ ఏజెంట్లు హాజరై ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ శ్రీరామమూర్తి, ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు, ఎంపీపీ బుల్లిలక్ష్మి


గొండుపాలెం రైతు సేవా కేంద్రంలో వేరుశనగ విత్తనాల పంపిణీ

దేవరాపల్లి : ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మితో కలిసి బుధవారం ఆయన రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాల బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లాభసాటి పంటలు సాగు చేయడం ద్వారా ఆర్థిక ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో నగదును ఖాతాలో జమ చేస్తామని అన్నారు. ఏవో కాంతమ్మ మాట్లాడుతూ మండలంలో 96 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 30 కేజీల బస్తా ధర రూ. 2880 కాగా ప్రభుత్వ రాయితీ 1152 పోను రైతు రూ.1728 చెల్లించాలన్నారు. మినుములు, పెసర, రాగి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కె.కోటపాడు : రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనాలు అందిస్తున్నట్టు సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి అన్నారు. గొండుపాలెం రైతు సేవా కేంద్రంలో బుధవారం వేరుశెనగ, మినుములు, పెసర విత్తనాలను పంపిణీ చేశారు. 40 శాతం రాయితీపై ఈ మూడు రకాలైన విత్తనాలను అందిస్తున్నట్టు వ్యవసాయశాఖ సహాయకుడు సుధీర్ అన్నారు. రైతు సేవా కేంద్రంలో 200 బస్తాల వేరుశెనగ విత్తనాలు ఉన్నాయని, బస్తాకు రూ.1750 చెల్లించాలని అన్నారు. 4 కిలోల మినుములకు రూ.394, పెసలు 4 కిలోల విత్తనాలు రూ.364లకు అందిస్తున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ నారాయణమ్మ, లక్ష్మణరావు, కన్నంనాయుడు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉపాధి అవకాశాలు


మాడుగుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న అరుంధతి

మాడుగుల రూరల్ : విద్యార్థులు తగినన్ని నైపుణ్యాలు పెంపొందించుకున్నప్పుడే ఉపాధి అవకాశాలు అంది వస్తాయని, మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలు -ఉపాధి అవకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. టెక్ మహేంద్ర నంది స్వచ్ఛంద సంస్థ శిక్షకురాలు అరుంధతి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవడానికి జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడేతత్వం మొదలైనవి జీవితంలో భాగం కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, ఉపన్యాసకులు డాక్టర్ పైడిరాజు, డాక్టర్ శర్మిలశ్రీ, డాక్టర్ రమణమూర్తిరాజు, డాక్టర్ అప్పలనాయుడు, నారాయణ, ఎన్.ఎస్.ఎస్ పోగ్రాం అధికారి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా తాచేరు వంతెన

ఆర్‌టీసీ బస్సులు నడపాలని గ్రామస్తుల వినతి


నిర్మాణ పనులు పూర్తయిన తాచేరు వంతెన

మాడుగుల : మండలంలో మాడుగుల దేవీ ఆలయం నుంచి మోదమాంబ కాలనీ మీదుగా సాగరం వెళ్లే మార్గమధ్యలో తాచేరుపై వంతెన నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ 3.40 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో ప్రస్తుతం పనులు పూర్తయ్యాయి. వంతెనకు రంగులు కూడా అద్దడంతో ఆకర్షణీయంగా తయారయింది. నియోజకవర్గ కేంద్రం మాడుగుల రావడానికి సుమారు 40 గ్రామాల ప్రజలకు ఈ వంతెన ఆధారమైంది. పాడేరు నుంచి మాడుగుల రావడానికి, మాడుగుల నుంచి పాడేరు వెళ్లడానికి ఆర్‌టీసీ బస్సులు తిరగడానికి ఈ వంతెన రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఆర్‌టీసీ బస్సులు నడపాలని, పలు గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

మాడుగుల రూరల్ : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో రెండు గ్రామాల్లో బుధవారం 160 మందికి వైద్య సేవలు అందించారు. కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కె.జె.పురం సచివాలయంలో 120 మందికి వైద్యాధికారి కె.లీలాప్రసాద్ వైద్య సేవలు అందించారు. బీపీ, సుగర్, వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. స్థానిక ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సహాయకుడు పి.శంకర్ పాల్గొన్నారు. కింతలి పీహెచ్‌సీ పరిధి శరభన్నపాలెంలో వైద్యాధికారి మాలంనాయుడు 40 మందికి వైద్య సేవలు అందించారు. 104 సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల్లో సమయపాలన పాటించాలి


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో నాగేశ్వర్రావు

రోలుగుంట : విధుల్లో సమయపాలన పాటించాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వర్రావు ఆదేశించారు. మండలంలో గల రత్నంపేట సచివాలయాన్ని ఆయన సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి చిరంజీవితో కలిసి సచివాలయానికి వస్తున్న శాఖల వారీగా అర్జీలపై చర్చించారు. ఆ సమయంలో వచ్చిన అర్జీదారులతో ఎంపీడీవో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు.

బ్రూసెల్లా టీకాలు వేయించండి


జైతవరంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

చీడికాడ : ప్రతి ఆడపెయ్యికి బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఖండివరం పశువైద్యాధికారి ఎ.సిహెచ్.గణేష్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం జైతవరం, అప్పలరాజుపురం రైతు సేవా కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ టీకాలు కార్యక్రమం వచ్చే నెల 19వ తేదీ వరకు జరుగుతుందన్నారు.

7న పీఎంసీ సమావేశం

చీడికాడ : వచ్చే నెల 7వ తేదీన పాఠశాలలో నిర్వహించనున్న పేరెంట్స్ కమిటీ సమావేశానికి తల్లిదండ్రులంతా హాజరు కావాలని మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి కోరారు. బుధవారం పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులతో మాట్లా డారు. పీఎంసీ మీటింగ్‌కు వచ్చే వారికి భోజన వసతి కల్పించనున్నామని చెప్పారు. ఎంపీడీవో హేమసుందరరావు, సీఐటీయు నేత దేముడునాయుడు పాల్గొన్నారు.

కోలాటం ప్రదర్శించిన మహిళలకు చీరలు పంపిణీ


కోలాటం బృందానికి చీర, జాకెట్, కోలాటం సామాగ్రిని అందిస్తున్న వైస్ ఎంపీపీ

కె.కోటపాడు : పాచిలవానిపాలెంలో 32 మంది మహిళలు ఇటీవల కోలాటం ప్రదర్శనలో శిక్షణను పొందారు. వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, పీవీపీ యూత్ సభ్యులు వారి సొంత నగదు రూ.40 వేలతో చీరలు, జాకెట్, కోలాటం సామాగ్రిని సమకూర్చి 32 మంది మహిళలకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు గండి సత్యం, పాల సంఘం అధ్యక్షుడు నాయుడుబాబు, దేముడుబాబు పాల్గొన్నారు.

పాత పద్ధతిలో విద్యుత్ బిల్లులు స్వీకరించాలి



నాతవరం : గతంలో మాదిరిగానే కరెంటు బిల్లులు గ్రామంలోకి వచ్చి కట్టించుకోవాలని గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణమూర్తి కోరారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కరెంటు బిల్లులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని చెప్పడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతంలో చాలామంది విద్యుత్ వినియోగదారులు నిరక్షరాస్యులని, ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపు సదుపాయం కలిగి లేరని అన్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్య కూడా ఉందన్నారు.

అల్ప'పీడ'నంతో వరి రైతుకు గుబులు


పొలంలో వరి కుప్పలు పెడుతున్న రైతులు

మాడుగుల రూరల్ : బంగాళాఖాతంలో అల్పపీడనం తుపానుగా మారడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఖరీఫ్ వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. ఆరుగాలం పండించిన వరి పంట కోత కోసే సమయంలో వర్షాలు పడితే పంట కూడదీసుకోలేమని రైతులు ఆందోళన చెందుతున్నారు. 90 శాతం మేర వరి పంట పండింది. కోతలు పూర్తయిన పంటను పొలాల్లో కుప్పలు పెడుతున్నారు. మండలంలో ఒమ్మలి, వీజేపురం, గాదిరాయి, జె.డి.పేట, ఎం.కృష్ణాపురం, జంపెన, సత్యవరం, కింతలి, వల్లాపురం, వీరవల్లి, పోతనపూడి, వీరనారాయణం, జి.అగ్రహారం, తదితర గ్రామాల్లో వరి పంటను కోశారు. కొన్ని గ్రామాల్లో వరి పంట కోత దశకు చేరుకుంది. తుపాను ప్రభావంతో రైతులు పంట కోయడానికి సాహసించడం లేదు. తుపాను వర్షాల దృష్ట్యా వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు రైతులకు సూచించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతంగా మారింది.

రోగులకు మెరుగైన సేవలు అందాలి


కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, సభ్యులు

మాకవరపాలెం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ రుత్తల లక్ష్మి వైద్య సిబ్బందికి సూచించారు. బూరుగుపాలెం పీహెచ్‌సీలో బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, ఎంపీపీ మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. ఈ ఏడాది ఆస్పత్రి అభివృద్ధికి మంజూరైన రూ.40 వేలతో కొనుగోలు చేసిన పరికరాలను ఆమె పరిశీలించారు. కొత్తగా చేపట్టనున్న పనులపై చర్చించి, వాటిని చేసేందుకు నిర్ణయించారు. పీహెచ్‌సీ ఆవరణ లోతట్టుగా ఉండడంతో వర్షపు నీరు నిల్వ ఉండి పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో పాటు విషపురుగులు, పాములు సంచరిస్తున్నాయని వైద్యాధికారులు చరిష్మ, చరణ్ ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. మండల పరిషత్ నిధులతో ఆవరణ ఎత్తు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూరుగుపాలెం సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆవుపాల ధరను పునరుద్ధరించాలి


గొండుపాలెంలో పాడి రైతులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకుడు యర్రా దేముడు

కె.కోటపాడు : విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల ధరను మరలా పునరుద్ధరించాలని సీపీఎం నాయకుడు యర్రా దేముడు అన్నారు. ఈ విషయమై డిసెంబర్ 2న చేపడుతున్న విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని బుధవారం గొండుపాలెంలో పాడి రైతులను కోరారు. కరపత్రాలను పంపిణీ చేశారు. రైతుల వద్ద నుంచి సేకరిస్తున్న ఆవు పాల ధరకు, అమ్మకం ధరకు గల వ్యత్యాసం రూ.10లను రైతులకు చెల్లించే ధరలో కలపాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ సభ్య రైతులకు నాలుగు నెలలకు ఒకసారి బోనస్‌ను చెల్లించాలన్నారు. ఆవుపాలకు గరిష్టంగా లీటర్‌కు రూ.50, గేదె పాలకు లీటర్‌కు రూ.75 చెల్లించడంతో పాటు దాణాను 75 శాతం రాయితీపై రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఖండిపల్లిలో ఘనంగా గౌరమ్మ సారె ఊరేగింపు


ఖండిపల్లి గ్రామంలో జరిగిన శ్రీ గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

చోడవరం: ఖండిపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గౌరీపరమేశ్వరులకు సారె ఊరేగింపు బుధవారం కన్నుల పండువగా ఎంతో వైభవంగా జరిగింది. ఊరూ వాడా అంతా కలిసి శ్రీ గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపులో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు తెచ్చిన మిఠాయిలు, పండ్లు, వంటలతో తీన్‌మార్ డప్పుల మోతలు, మేళతాళాల మధ్య అమ్మవారి సారె ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం సారెను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉత్సవాన్ని చూసేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం గౌరరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా జరిపారు. సర్పంచ్ శానాపతి రాజశేఖర్, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంపాలెంలో పూరిల్లు దగ్ధం

- కట్టుబట్టలతో మిగిలిన నిరుపేద గిరిజన కుటుంబం
- నగదు, తిండి గింజలు, విలువైన పత్రాలు దగ్ధం


నగరంపాలెంలో అగ్ని ఆహుతవుతున్న పూరిల్లు

దేవరాపల్లి : మండలంలోని వాలాబు పంచాయతీ శివారు నగరంపాలెంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన తామర్ల కొండబాబు ఇంటికి బుధవారం తెల్లవార జామున అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని కొండబాబు కుటుంబ సభ్యులు గ్రహించి తృటిలో ఇంటి నుంచి బయటపడ్డారు. అయితే ఇంటిలో దాచుకున్న నగదుతో పాటు భూమి పట్టదారు పాసుపుస్తకం, ఆధార్, రేషన్ కార్డులు, వంటపాత్రలు, తిండి గింజలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు కొందరు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికే ఫలితం లేకపోయింది. ఘటనా స్థలాన్ని వీఆర్వో ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గోపినాథ్ పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

పాముల సంచారంపై జాగ్రత్తగా ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెంకటేష్

మాడుగుల : పాముల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని స్నేక్ కేచర్ పెచ్చేటి వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక సెయింటిన్స్ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పాములు కాటు వేసినప్పుడు సొంత వైద్యం చేయకుండా వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాలన్నారు. వరి చేలు కోసే సమయం కావడంతో వరి పనలు అడుగున పాములుంటాయని, జాగ్రత్తగా వరి పనలు తీసుకోవాలన్నారు. ఇంతవరకూ 20 చోట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. మండలంలో అందరికీ అందుబాటులో ఉంటానని, పాములు కంట పడితే తనకు సమాచారం అందజేయాలన్నారు. వాటిని పట్టుకుని సమీప కొండల్లో విడిచి పెట్టడం జరుగుతుందన్నారు. తన ఫోన్ నంబరు మండలంలో అన్ని పంచాయతీల్లో ఉందన్నారు.